ప్రజాశక్తి

మంగళవారం 21 మార్చి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నిర్బంధంపై నిరసనలు

- అంగన్‌వాడిలపై ప్రభుత్వ వైఖరి దారుణం
- సమస్యలను పరిష్కరించాల్సిందే : సిఐటియు, సిపిఎం
- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆందోళనలు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

తమ సమస్యలను పరిష్కరించాలంటూ చలో విజయవాడకు బయలుదేరిన అంగన్‌వాడీలపైనా, సిఐటియు నేతలపైనా సోమవారమూ ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించింది. అనకాపల్లి జిల్లా కశింకోట మండల కేంద్రంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కె.కోటపాడు మండలంలో అంగన్‌వాడీలను గృహ నిర్బంధంలో ఉంచారు. మరోవైపు నిర్బంధంపై విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం నిరసనలు హోరెత్తాయి. విశాఖ నగరంలో జగదాంబ సెంటర్ నుంచి వాచ్‌హౌస్ జంక్షన్ వరకు సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యాన భారీ ప్రదర్శన నిర్వహించారు. అక్కడి నుంచి జగదాంబ జంక్షన్ తిరిగి వచ్చి రాస్తారోకో చేపట్టారు. పోలీసులు అడ్డుకోవాలని చూసినా ఆందోళనకారులు ప్రతిఘటించి ముందుకుసాగారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలోని నెహ్రూ చౌక్ జంక్షన్‌లో సిఐటియు ఆధ్వర్యాన భారీ ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వారిని విడిచిపెట్టారు. రాంబిల్లి తహశీల్దారు కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. నక్కపల్లి మండల కేంద్రంలోనూ ఆందోళనలు జరిగాయి.



విశాఖలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



అనకాపల్లిలో మానవహారం చేపట్టిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల డిమాండ్లు ఇవే..

తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలి. ఫేస్ యాప్ రద్దు చెయ్యాలి. సుప్రీం తీర్పు ప్రకారం కనీస వేతనం ఇవ్వాలి. పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలి. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలి. గ్యాసును ప్రభుత్వమే సరఫరా చెయ్యాలి. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న మిగతా 2లో..

పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి చర్యలు

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి, సింహాచలం



విశాఖలో 22 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న పంచగ్రామాల సమస్యను పరిష్కరించేందుకు త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం అమరావతి సచివాలయం రెండో బ్లాకు మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనర్సింహ స్వామి భూములను పరిరక్షించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. అక్కడ నెలకొన్న పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి సంబంధించి అటు దేవస్థానం భూమికి నష్టం వాటిల్లకుండా, ఇటు అక్కడ చాలా కాలంగా నివాసం ఉంటున్న ప్రజలకు ఇబ్బంది కలగకుండా సమస్య పరిష్కారానికి త్వరలో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి తన అధ్యక్షతన జిల్లా మంత్రులు, ఎంపీ, ఇద్దరు శాసన సభ్యులు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం, సిసిఎల్ఎ, జిల్లా కలెక్టర్ తదితర సభ్యులతో కమిటీని ఏర్పాటు మిగతా 2లో..

'ఉక్కు' ప్రైవేటీకరణపై ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ మెయిన్ అడ్మినిస్ట్రేషన్ గేటు, ట్రైనింగ్ సెంటర్ వద్ద సోమవారం ఉదయం ధర్నా చేపట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యం తో నడిపించాలని, తక్షణమే 2017 వేతన ఒప్పందాన్ని సెయిల్‌లో మాదిరి అమలు చెయ్యాలని పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కో-కన్వీనర్ జె.అయోధ్య రామ్ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను సిక్ ఇండస్ట్రీగా మార్చాలని కేంద్రం కుట్రలు పన్నుతోందన్నారు. ఇప్పటికైనా మిగతా 2లో..



ధర్నాలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

వీరనారి.. మల్లు స్వరాజ్యం

వార్త 4లో..

3న ఇగ్నో 36వ స్నాతకోత్సవం

వార్త 2లో..

ఉప్పుటేరులో చేపలు మృత్యువాత

వార్త 7లో..

విశాఖలో వాన



విశాఖ నగరంలో సోమవారం సాయంత్రం జోరు వాన కురిసింది. పూర్ణామార్కెట్, ఆరిలోవ, గాజువాక, గోపాలపట్నం ఏరియాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల రోడ్లపై వర్షపు నీరు పొంగి ప్రవహించింది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

స్పందన అర్జీలను పరిష్కరించండి

వార్త 2లో..

ఆర్ఎస్ఎస్ దేశానికి అంకితం

వార్త 7లో..

మొదటి పేజీ తరువాయి..

నిర్బంధంపై నిరసనలు

టిఏ బిల్లులు వెంటనే ఇవ్వాలి. గ్రాడ్యూటీ ఇవ్వాలి. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలి. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలి. సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలి. సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలి. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలి.

నిర్బంధాన్ని ఖండించండి : సిపిఎం

కనీస వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్‌లో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీ, సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్న అంగన్వాడీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో వేతనాలు, బిల్లులు చెల్లించకుండా వ్యవహరించడం సరైనదికాదన్నారు. పక్కనే ఉన్న తెలంగాణ కంటే అదనంగా వెయ్యి రూపాయలు వేతనం పెంచుతానన్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేడు ఆ సమస్యను పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిర్బంధకాండను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై ధర్నా

ఆ ప్రయత్నాలను విరమించుకోకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కర్మాగారంలో ఉత్పత్తికి సరిపడా ముడిసరుకు నిల్వలు ఉంచాలన్నారు. బ్యాంకులో తీసుకున్న రుణాలను మూలధనంలో ఈక్విటీగా మార్చాలని, వడ్డీపై పది సంవత్సరాల పాటు ఇంట్రెస్ట్ హాలీడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను మూసేసి అదానీకి అమ్మాలని చూడటం దారుణమన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బిసి రోడ్‌లో మంగళవారం జరగనున్న ధర్నాను సైతం కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో ఢిల్లీలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ఎంపీల మద్దతు కూడగట్టనున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి విశాఖలోని ఎంపీలను కలిసి వినతి పత్రాలు సమర్పిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వంపై అన్ని వైపుల నుంచీ ఒత్తిడి పెంచి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. పోరాటాలతో సాధించుకున్న కర్మాగారాన్ని పోరాటాలతోనే నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కెఎస్‌ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, వైటి.దాస్, వై.మస్తానప్ప, విళ్లా రామ్మోహన్ కుమార్ పాల్గొన్నారు.

పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి చర్యలు

చేశారన్నారు. ఆ కమిటీ సమావేశం సోమవారం సచివాలయంలో నిర్వహించి ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించామని, రెండు రోజుల్లో దీనిపై ఒక నిర్ణయం తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అదేశాల మేరకు దేవస్థానం భూమి విలువకు సమానమైన భూమిని దేవస్థానానికి ప్రభుత్వం బదలాయించేందుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు. అంతకు ముందు జరిగిన కమిటీ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంఎల్‌ఎ అదీప్ రాజు, సిసిఎల్‌ఎ జి.సాయి ప్రసాద్, విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, అదనపు సిసిఎల్‌ఎ ఇంతియాజ్, దేవాదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించండి : సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం

పంచ గ్రామాల సమస్యను త్వరగా పరిష్కరించాలని సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు బి.రమణి కోరారు. గత ప్రభుత్వం ఇళ్ల మరమ్మతులకు అనుమతివ్వగా దేవస్థానం అధికారులు దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. ఇటువంటివి పునరావృతం కాకుండా ప్రజలకు న్యాయం చేయాలన్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని విశాఖ జాయింట్ కలెక్టర్ కెయస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగులో ఉన్న పిటీషన్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇదిలా ఉండగా సోమవారం స్పందన కార్యక్రమంలో 155 విజ్ఞప్తులు అందాయి. కార్యక్రమంలో డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

3న ఇగ్నో 36వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) 36వ స్నాతకోత్సవం ఏప్రిల్ 3న ఉదయం 11 గంటలకు జరుగనుంది. గౌరవ అతిథిగా కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ఆచార్య టివి.కట్టిమణి హాజరై విద్యార్థులకు డిగ్రీ, డిప్లొమోలను ప్రదానం చేయనున్నారు. ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగనుంది. ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తారు. విశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో ఉన్న సమావేశ మందిరంలో ఈ వేడుక జరుగనుందని సోమవారం ఒక ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు.

తోపుడు బండ్ల కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మద్దిలపాలెం జంక్షన్‌లోని సిఎంఆర్ సెంట్రల్ గోడవైపు ఉన్న 20 తోపుడు బండ్లపై కార్మికులు 20 సంవత్సరాలుగా వ్యాపారం చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారని, వారి పొట్టగొట్టేలా ఇప్పుడు మెయిన్ రోడ్డు వైపు పెన్సింగ్ వేయడానికి జివిఎంసి అధికారులు చేస్తున్న ప్రయత్నాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నం తోపుడు బండ్ల కార్మికుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ ఇక్కడి కార్మికులకు పాత పద్ధతిలోనే వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఇక్కడ హాకర్ జోన్‌ను ప్రకటించారని, వెండింగ్ బోర్డు కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. జి 20 సమావేశాల పేరుతో 15 రోజులుగా మద్దిలపాలెం జంక్షన్ నుంచి ఎన్ఎడి కొత్త రోడ్డు వైపు గ్రీన్ బెల్ట్‌కి పెన్సింగ్ వేస్తున్నారని, అందులో భాగంగా తోపుడు బండ్ల కార్మికులకు హాకర్ జోన్ ప్రకటించిన ప్రదేశంలోనూ పెన్సింగ్ వేయడం ప్రారంభించారని చెప్పారు. దీంతో తోపుడు బండ్ల కార్మికులు వ్యాపారం చేసుకోవడానికి, కొనుగోలుదారులు రావటానికి వీలులేకుండా పోతుందన్నారు. రెండు వారాలుగా ఫెన్సింగ్ వేయటం వల్ల వ్యాపారాలు లేక వీధి వ్యాపారుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మరోవైపు మాధవధార హైవేలో కార్ల షోరూమ్‌లకు, షాపింగ్ మాల్స్‌కు, నివాస ప్రాంతాలకు గ్రీన్ బెల్టు ప్రాంతాల్లో రోడ్లు వేసి వ్యాపారులకు అవకాశం కల్పించారని చెప్పారు. అదేవిధంగా సిఎంఆర్ సెంట్రల్ వద్ద తోపుడు బండ్ల వ్యాపారులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తోపుడు బండ్ల కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం, జి.శ్రీనివాసరావు, ఎస్.చిన్ని తదితరులు పాల్గొన్నారు. అనంతరం జివిఎంసి కమిషనర్‌కు స్పందనలో వినతి పత్రం సమర్పించారు.



ధర్నా చేస్తున్న తోపుడు బండ్ల కార్మికులు

నీట్ పీజీ ర్యాంకర్‌కు ఎంపీ ఎంవివి అభినందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నీట్ పీజీ 2023లో ఆల్ ఇండియా 750వ ర్యాంకు సాధించిన ఐశ్వర్యమిని సిద్ధానాతిని విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనలేని కృషి, పట్టుదల, కఠోర శ్రమతో ఇలాంటి విజయాలు సాధ్యమని తెలిపారు. ఐశ్వర్యమిని ఎంసెట్ 2016లో 127 ర్యాంక్ సాధించి, విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ చదివారని గుర్తు చేశారు. ఆమె తండ్రి డాక్టర్ నవీన్ సిద్ధానాతి ప్రభుత్వ వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్‌కాగా, తల్లి పద్మావతి గృహిణి అని తెలిపారు.


ఐశ్వర్యమినిని అభినందిస్తున్న ఎంపీ ఎంవివి.సత్యనారాయణ

జిఒ 1పై ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ 1ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడారు.

దాడులు హేయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపి అసెంబ్లీ సమావేశాల్లో టిడిపి సభ్యులు వైసిపికి చెందిన దళిత శాసనసభ్యుడు సుధాకర్‌పై దాడి చేయడాన్ని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్యంలో దాడులు సహేతుకం కాదని పేర్కొన్నారు.

మేయర్ భర్తపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను దుర్భషలాడి బెదిరించిన నగర మేయర్ భర్త గొలగాని శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సోమవారం పోలీస్ కమిషనరేట్‌లోని స్పందనలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా తోటగరువు వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్ స్వామి విధులు నిర్వహిస్తుండగా శ్రీనివాసరావు అక్కడికి చేరుకొని భయభ్రాంతులకు గురిచేశారన్నారు.

స్పందనకు 7 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు 7 అర్జీలు అందాయి. ఈ నెల 20న ప్రారంభమైన భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ ఉత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశముందని, ఈ నేపథ్యంలో తాగునీరు కల్పించాలని, అదనంగా పారిశుధ్య సిబ్బందిని నియమించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు వినతి పత్రం ద్వారా కోరారు. వినతి అందజేసిన వారిలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు ఉన్నారు.

హమాలీల నిరసన

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ కోరుతూ పద్మనాభం మండల కేంద్రంలోని సివిల్ సప్లై స్టాక్ పాయింట్ వద్ద హమాలీలు నిరసన తెలిపారు. గోదాము నుంచి డీలర్ వద్దకు సరుకులు తీసుకెళ్లినప్పుడు దింపుడు కూలి వెంటనే చెల్లించాలని, ఏరియర్స్ ఇవ్వాలని, పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని, మూడు జతల యూనీఫాం, కుట్టుకూలి ఇవ్వాలని హమాలీలు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కలెక్టరేట్, విశాఖ : రేషన్ దుకాణాలకు బియ్యాన్ని అప్‌లోడ్ చేసిన హమాలీలకు ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఏపీ సివిల్ సప్లయిస్ హమాలి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ డిపో వద్ద బియ్యం బస్తాలను దింపే హమాలీలకు డీలర్లే కూలి డబ్బులు చెల్లించేవారని, ప్రస్తుతం తాము చెల్లించలేమని వారు చేతులెత్తేస్తున్నారని తెలిపారు. ఈ కూలి డబ్బులను పౌరసరఫరాల శాఖ చెల్లించాలని కోరారు. రెండేళ్ల వ్యవధిలో రిటైర్ అయిన, మృతి చెందిన హమాలీల కుటుంబాలకు పిఎఫ్, పెన్షన్ బకాయిలు ఇవ్వాలని, కొత్తవారికి నెంబర్లు కేటాయించాలని, బ్యాంకుల నుంచి రుణం పొందే అవకాశం కల్పించాలని డిమాండ్‌చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

22న ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యాన ఈ నెల 22న హిందీ విద్యార్థులకు ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభించనున్నట్లు ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరుగనున్న హిందీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉచిత శిక్షణా తరగతులను వినియోగించుకోవాలని కోరారు.

కళ్లద్దాల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన కంటి అద్దాల సరఫరాకు టెండర్ల స్వీకరణకు సంబంధించి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ విశ్వమిత్ర సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు 6 వేల మందికి అద్దాలు, ఫ్రేమ్ కలిపి ఒక్కొక్కటి రూ.280 ధర మించకుండా సీల్డ్ కవర్ ద్వారా ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు రూ.5 వేల ధరావత్తుతో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాల, విశాఖపట్నం వారికి టెండర్ దాఖలు చేయవలసినదిగా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇళ్ల తొలగింపులు అడ్డగింత

ప్రజాశక్తి -ఆనందపురం : రామవరం గ్రామంలో నిర్మించుకున్న గృహాలను రెవెన్యూ అధికారులు తొలగింపునకు సిద్ధంకావడాన్ని పలువురు గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనికి సంబంధించి గ్రామస్తులు కథనం ప్రకారం... రామవరం గ్రామంలో ఎర్ర దుర్గారావు తమ డిపట్టా స్థలంలో ఇల్లు నిర్మాణం చేపట్టాడు. దీనిపై స్థానిక వైసిపి నాయకులు అక్రమ కట్టడాలని ఫిర్యాదు చేశారు. దుర్గారావు తండ్రి గతంలో తన డిఫారం పట్టా భూమిలో కొంత భాగాన్ని గుడి, గ్రామాభివృద్ధి కోసం కేటాయించారు. మిగిలిన స్థలంలో దుర్గారావు కుటుంబంతోపాటు మరి కొంతమందికి ఇళ్ల స్థలాలు ఇస్తామని గత తహశీల్దార్ వేణుగోపాలరావు చెప్పారు. అదే స్థలంలో ఎర్ర దుర్గారావు ఇల్లు నిర్మాణం చేపట్టారు. దీనిపై ఎర్ర అప్పలరాజు, మరికొంతమంది కక్ష సాధింపు చర్యలో భాగంగా ఫిర్యాదు చేశారు. దీనిపై సోమవారం వీఆర్వో ప్రియనాథ్, ఆర్ఐ మణికంఠ జెసిబితో ఇళ్ల నిర్మాణాలను కూలగొట్టడానికి ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుపడ్డారు. గత తహశీల్దార్ ఆదేశాల మేరకే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని, మీరు ఎలా అడ్డుకుంటారని స్థానికులు నిలదీయడంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు.



శ్లాబును కూల్చివేసిన రెవెన్యూ సిబ్బంది

కనుమాంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం కనుమాం గ్రామంలో పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె. హరీష్ ఆధ్వర్యాన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆబోతు అప్పలరాము మాట్లాడుతూ, పల్లె ప్రజలకు వైద్యం మరింత చేరువచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సుమారు 69 మందికి వైద్య సిబ్బంది తనఖీలు నిర్వహించారు. బాలింతలు, మధుమేహం, రక్తపోటు ఉన్నవారికి పరీక్షలు జరిపారు. గర్భిణులకు ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతున్న రోగులు వద్దకు వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారు తీసుకుంటున్న చికిత్స, వాడుతున్న మందులు వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలిచ్చారు. అంగన్‌వాడి కేంద్రాలను, స్థానిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరాతీశారు.

సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి మాట్లాడుతూ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మందులు సక్రమంగా వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు టి.కల్యాణమ్మ, పి.సన్యాసిరావు, సిహెచ్.ఒ దుర్గ, శ్యామ్, ఆరోగ్య కార్యకర్తలు ఎస్.రాములమ్మ, బి.తారకేష్, టి.జ్యోతి, ఆశ కార్యకర్తలు పి.సన్యాసమ్మ, పి.లక్ష్మి, ఈశ్వరమ్మ, పైలెట్ పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి అందుకున్న టెన్త్ విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులు 83 మందికి సోమవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. విశ్రాంత వీఆర్వో పల్లంటి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం తాటితూరు మాజీ సర్పంచ్ పల్లంటి రాజేశ్వరి కుమారుడు ప్రస్తుత వీఆర్వో శ్యామ సుందరరావు ఈ సామగ్రి అందించారు. టెన్త్ విద్యార్థులలో ఒక్కొక్కరికి రెండేసి చొప్పున బ్లూ ఇంక్ పెన్నులు, బ్లాక్ పెన్, ప్లాంక్, రబ్బరు, స్కేల్, పెన్సిల్, పౌచ్ పంపిణీచేశారు. విద్యా సామగ్రి అందించిన కుటుంబాన్ని హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టిఎస్‌వి ప్రసాదరావు, ఎస్ఎంసి చైర్మన్ సరగడ రవి, యువజన నాయకులు గురునాయుడు తదితరులు అభినందించారు.

గీతం మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థుల 'సంఘర్ష్'

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన సాంకేతిక యువజనోత్సవం "సంఘర్ష్-6.0" సోమవారం ఘనంగా ప్రారంభమైంది. హోమిబాబా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఎమిరిటస్ ప్రొఫెసర్, ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త పద్మశ్రీ అవార్డు గ్రహీత రవి.బి.గ్రోవర్ ముఖ్యఅతిథిగా హజరై ఈ ఉత్సవాలను ప్రారంభించారు. దేశంలో శక్తి ఉత్పాదన రంగంలో అణు విద్యుత్తు అసలైన ప్రత్యామ్నాయం అని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రగతితో పాటు విద్యుత్తు అవసరాలు పెరుగుతున్నాయని, కర్బన ఉద్గారాలు వెలువడని సంప్రదాయేతర ఇందన వనరులను ప్రత్యామ్నాయంగా పేర్కొంటున్నప్పటికీ వాటి ద్వారా అయ్యే విద్యుత్తు ఉత్పాదన వ్యయం అధికంగా ఉటుందని పేర్కొన్నారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో అవసరానికి సరిపడా విద్యుత్తు అందించాలంటే అణు విద్యుత్తు కేంద్రాల ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. దేశంలో ప్రస్తుతం అణువిద్యుత్తు ఉత్పాదన 6780 మెగా వాట్లుగా ఉందని, ఇది మరింతగా పెరగడానికి నూతన అణు విద్యుత్తు కేంద్రాల ఏర్పాటు జరుగుతోందన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్ మాట్లాడుతూ, ఇంజనీరింగ్‌లో విభాగాల మధ్య హద్దులు చెరిగిపోయి నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తోందని తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాని సూచించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్, ఫ్యాకల్టీ సలహదారు డాక్టర్ ఆర్.బానుపవన్, ఏటికొప్పాక బొమ్మల తయారీ నిపుణుడు, జాతీయ ప్రతిభ అవార్డు గ్రహీత పెదపాటి ఆనందాచారి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు రూపొందించిన రోబో నమూనాలు, స్వయంగా తయారు చేసిన వాహనాలు, హైడ్రో గ్రావిటీ పేరిట రూపొందించిన నీటి శుద్ధి పరికరం ఇతర ఆవిష్కరణలను టెక్ ఎక్స్‌పో పేరిట ప్రదర్శనగా ఉంచారు. సంఘర్ష్ 6.0లో భాగంగా విద్యార్థులకు వివిధ వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ అధ్యక్షుడు బసంత్, ఉపాధ్యక్షులు శ్రేయ తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సబ్బవరం రోడ్డులో శంకరం గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... సబ్బవరం మండలం అసకపల్లి గ్రామానికి చెందిన దువ్వి ఈశ్వరరావు (58) సబ్బవరం నుంచి అనకాపల్లి తన ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. శంకరం దగ్గరకు వచ్చేసరికి వెనకనుంచి వస్తున్న లారీ ఈశ్వరరావును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఈశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశాన వాటికలో సోలార్ వెలుగులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇండో గ్లోబల్ సోషల్ సర్వీసెస్ సొసైటీ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆర్థిక సాయంతో 13వ వార్డు ఆరిలోవ కాలనీ, శివాజీనగర్ -2లోని శ్మశాన వాటికలో సోలార్ దీపాలను ఏర్పాటుచేశారు. వార్డు వైసిపి అధ్యక్షులు కెల్ల సత్యనారాయణ సంస్థ ప్రతినిధులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పిల్లి వీర్రాజు, బేత దుర్గారావు, ముస్లిం మత పెద్దలు, స్థానిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

బస్టాపు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయరహదారిలో పాత డెయిరీ ఫారం సమీపంలో బస్టాపు ఏర్పాటుచేయాలని కోరుతూ ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ, మౌలిక వసతులు అభివృద్ధి సంస్థ డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, 10వ వార్డు వైసిపి అధ్యక్షులు పతివాడ కనకరాజు వినతిపత్రం అందజేశారు. మధురవాడ, ఆనందపురం, తగరపువలస, విజయనగరం వెళ్ళేందుకు విశాలాక్షినగర్ ఎదురుగా గల పాత డెయిరీఫారం వద్ద బస్టాపు ఉండేదని, ఏడాది క్రితం జివిఎంసి అవసరాల కోసం ఆ బస్టాపును తొలగించారని తెలిపారు. బస్టాపు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సిగ్నల్ తరువాత రాజీవ్‌నగర్, భూమాత కార్యాలయం వద్ద బస్టాపును పునరుద్ధరించాలని కోరారు.

92 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : గుడివాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 92 మందికి పోలిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తిరుపతి స్వామి వైద్య పరీక్షలు జరిపారు. చిప్పాడ దివీస్ సహకారంతో ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరంలో సర్పంచ్ జమున, ఆసుపత్రి సిబ్బంది గాయత్రి, సూర్య కుమారి, రవి కుమార్, దివీస్ సిఎస్ఆర్ ప్రతినిధులు నాగరాజు, కె.నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి, ఉపాధ్యాయులు రవి, లావణ్య, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పార్టీ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు కార్యాలయానికి విచ్చేసి సమస్యలపై వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతి పత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనీల్‌కుమార్‌రాజు, మాజీ కార్పొరేటర్లు బాక్సర్ రాజు, మువ్వల పోలారావు, సీనియర్ నాయకులు కిరణ్‌రాజు, నీలి రవి, హరిపట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న కెకె.రాజు



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు

'శ్రీవిద్య'లో వైజ్ఞానిక ప్రయోగాలు

ప్రజాశక్తి-కంచరపాలెం : ఇందిరానగర్‌లో ఉన్న శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆదివారం, సోమవారం వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు పలు ప్రాజెక్టులు, ప్రయోగ నమూనాలను తయారుచేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ఎల్.త్రిమూర్తిరావు మాట్లాడుతూ, వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థులు జ్ఞానం సమకూరుతుందన్నారు. శాస్త్రీయ భావాలను అర్థం చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలను సందర్శించిన వారికి విజ్ఞాన శాస్త్రం ఏమి చేయగలదో అర్థమవుతుందని తెలిపారు. విద్యార్థులు రూపొందించిన నమూనాల గురించి తల్లిదండ్రులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఐఎంఎ జాతీయ అధ్యక్ష, ఉపాధ్యక్షులను సత్కరిస్తున్న స్థానిక నాయకులు

ఐఎంఎ జాతీయ అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

ప్రజాశక్తి-విశాఖపట్నం : రీజనల్ అకడమిక్ కాన్ఫరెన్స్. సందర్భంగా సోమవారం విశాఖ వచ్చిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శరద్‌కుమార్ అగర్వాల్, ఉపాధ్యక్షుడు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావును విశాఖపట్నం అసోసియేషన్ ఆధ్వర్యాన సన్మానించారు. ఐఎంఎ విశాఖపట్నం బ్రాంచిలో ఐఎంఎకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ విశాఖపట్నం అధ్యక్షులు డాక్టర్ పిజె.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ బాపారావు, కోశాధికారి డాక్టర్ ఎంవివి.మురళీమోహన్, డాక్టర్ ఎన్.సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఫణీంద్ర పాల్గొన్నారు.



ఐలా ఆఫీసులో చర్చలు జరుపుతున్న సెయిల్, ఐలా అధికారులు

ఆటోనగర్ డి బ్లాక్ విస్తరణకు మార్గం సుగమం

ప్రజాశక్తి -గాజువాక : ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గాజువాక ఆటోనగర్ డి బ్లాక్ రహదారి విస్తరణ పనులకు మార్గం సుగమమైంది. రహదారి విస్తరణపై స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాకు, గాజువాక ఆటోనగర్ ఐలా మధ్య తలెత్తిన వివాదం పెండింగ్‌లో ఉండటంతో ఆ సమస్య పరిష్కారానికి సోమవారం ఇరు సంస్థల సభ్యులు ఐలా ఆఫీసులో సమావేశమై ఒక అవగాహనకు వచ్చారు. రెండు సంస్థలకు అనుకూలంగా రహదారి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకున్నారు. తర్వాత జరగబోయే సమావేశంలో ఇరువురు అగ్రిమెంట్ చేసుకోవడానికి అవగాహన కుదుర్చుకున్నారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డి బ్లాక్ విస్తరణ పనులకు మోక్షం కలిగినట్లయింది. ఈ సమావేశంలో ఐలా కమిషనర్ సూర్యనారాయణ, సెక్రటరీ చీకటి సత్యనారాయణ, వాసేవ అధ్యక్షులు ఎకె.బాలాజీ, సెయిల్ అధికారులు పాల్గొన్నారు.

ఎయు ప్రగతిపట్ల పూర్వవిద్యార్థుల హర్షం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల 1979-83 బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఎయును సందర్శించారు. వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఎయును నూతన లక్ష్యాల దిశగా నడిపిస్తున్న విధానం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వీరనారి.. మల్లు స్వరాజ్యం

ప్రథమ వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు



ఐద్వా ఆధ్వర్యాన సిఐటియు కార్యాలయంలో...

ప్రజాశక్తి-యంత్రాంగం :

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల సోమవారం ఘనంగా నిర్వహించారు.

కలెక్టరేట్, విశాఖ : ఐద్వా, శ్రామిక మహిళా సమన్వయ (సిఐటియు) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభ జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ మాట్లాడుతూ, పేద ప్రజల సమస్యల విముక్తి కోసం పోరాడిన వీరనారి మల్లు స్వరాజ్యం అని చెప్పారు. పోరాట మార్గమే నిజమైన విముక్తికి దారి తీస్తుందని నమ్మిన గొప్ప పోరాట యోధురాలు అన్నారు. భూమికోసం, భుక్తి కోసం, పేద



ఐద్వా ఆధ్వర్యాన గుల్లలపాలెంలో...

ప్రజల విముక్తి కోసం జరిగిన పోరాటానికి ఆమె నాయకత్వం వహించారన్నారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేసినప్పుడే మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, జిల్లా నాయకులు వరలక్ష్మి, కె.మణి, బి.భారతి, డి.కొండమ్మ, కె.కుమారి, విమల, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, జిల్లా నాయకులు కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : 96వ వార్డు పరిధి పెందుర్తి సిఐటియు కార్యాలయంలో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యాన మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు బిటి.మూర్తి మాట్లాడుతూ, భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేద ప్రజల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి మల్లు స్వరాజ్యం అన్నారు. ఐద్వా నాయకులు బి.రమణి మాట్లాడుతూ, నాటి రోజుల్లో తుపాకి పట్టి గడగడ లాడించిన వీర వనిత అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శంకరరావు, సూర్యప్రకాష్, అప్పారావు, జగన్నాథ్ స్వామి, ఎస్.శంకరరావు, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధి గుల్లలపాలెంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి ఐద్వా జోన్ అధ్యక్షులు బి.మమత, నాయకులు కృష్ణవేణి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. సారా వ్యతిరేక ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ ఎజెండాగా మార్చడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆమె ఆశయ సాధనలో మహిళలంతా ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరమ్మ, నిర్మల, వరలక్ష్మి మహిళలు పాల్గొన్నారు.

సబ్బవరం : తెలంగాణ సాయుధ పోరాట ధీర వనిత



పెందుర్తి సిఐటియు కార్యాలయంలో...

మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి వేడుకలు స్థానిక దుర్గమాంబ ముఠా కళాసి సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి ముఖ్య అతిథిగా పాల్గొని మల్లు స్వరాజ్యం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వరాజ్యం పేదలకు భూములు కోసం, భుక్తి కోసం సాయుధ దళంలో తుపాకీ పట్టి పోరాటం చేసిన వీర వనిత అని తెలిపారు. ఆమె తనకున్న భూములను పేదలకు ధారాదత్తం చేసిన మహా త్యాగి అని పేర్కొన్నారు. మహిళా హక్కులకోసం అహర్నిశలు కృషి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు ఉప్పాడ సత్యవతి ఎం.గౌరీశ్వరరావు, యర్రా సోంబాబు, అప్పారావు, వరలక్ష్మి పాల్గొన్నారు.



సబ్బవరంలో నివాళులర్పిస్తున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-కంచరపాలెం : ఎస్సార్ కంపెనీలో వెల్డర్‌గా పని చేస్తూ విధుల్లో ఉండగా ఈ నెల 2వ తేదీన ప్రమాదానికి గురై 8వ తేదీన చనిపోయిన బడి అప్పారావు కుటుంబానికి తగిన న్యాయం చేయాలని, కార్మికుని మృతికి కారణమైన కంపెనీ యజమానిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఆందోళన చేశారు. కాన్వెంట్ జంక్షన్ సమీపంలో ఉన్న ఎస్సార్ కంపెనీ వద్ద మృతుని కుటుంబ సభ్యులు కార్మికులతో కలిసి సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మృతుని భార్య భూలక్ష్మి మాట్లాడుతూ, 2వ తేదీన ఎస్ఆర్ కంపెనీలో డ్యూటీ చేస్తుండగా తన భర్తకు ప్రమాదం జరిగిందని, సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో జాయిన్ చేశామని యాజమాన్యం నుంచి ఫోన్ వచ్చిందని తెలిపారు. ఆ రోజు నుంచి 8వ తేదీ వరకూ సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లోనే ఉంచి వైద్యం చేయించారని, ఖర్చు భారీగా అవుతుందని కెజిహెచ్‌కు తీసుకెళ్తామని చెప్పిన పావుగంటలోపే 'నీ భర్త చనిపోయారు' అని ఆసుపత్రి యాజమాన్యం చెప్పిందని వివరించారు. కంపెనీలో తన భర్తకు ఏ ప్రమాదం జరిగిందో చెప్పకుండా కళ్లు తిరిగి పడిపోయారని, ఆసుపత్రిలో చేర్పించామని యాజమాన్యం మోసం చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. పదేళ్లకు పైగా తన భర్త ఈ కంపెనీలోనే పనిచేస్తున్నారని తెలిపారు. భర్త మృతితో తాను, పిల్లలు అనాథలయ్యామని, ఎస్సార్ కంపెనీ యాజమాన్యం రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ కంపెనీ కార్మికులు, మృతుని భార్య, పిల్లలు, సిఐటియు సెక్రటరీ ఒ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు. మృతుని కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారాన్ని ఎస్సార్ కంపెనీ యాజమాన్యం ఇవ్వాలని సిఐటియు సెక్రటరీ ఒ.అప్పారావు డిమాండ్ చేశారు.



ఎస్సార్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబీకులు, మద్దతుగా నిలిచిన సిఐటియు నాయకులు అప్పారావు

సిఒసిసిపి విభాగం సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ సిఒసిసిపి విభాగంలో సమస్యలపై డిజిఎం రౌత్, జిఎం (హెచ్ఆర్) రాధిక, సీనియర్ మేనేజర్ (పర్సనల్) సుబ్రహ్మణ్యంతో నూతనంగా ఎన్నికైన ఒబిసి సంఘం నాయకులు చర్చించారు. విభాగంలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సంఘం అధ్యక్షులు బి అప్పారావు మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలతో ఒబిసి సంఘం పనిచేస్తుందని చెప్పారు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్‌లో ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించినట్లు వెల్లడించారు. అనంతరం కొత్తగా సభ్యులను చేర్చుకున్నారు. స్టీల్ ప్లాంట్‌లో ఉన్న ఒబిసిలు అందరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒబిసి సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, గెద్దాడ అప్పలరాజు కోయిలాడ శ్రీనివాసరావు, ఎస్‌కె.మొహిద్దిన్, పళ్ల పెంటారావు, వి.నర్సింగరావు, కామేశ్వరరావు, ఎస్ఎన్.మూర్తి, అప్పలరాజు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహాన్ని సందర్శించిన బులికృష్ణ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఎంవిపి కాలనీలోని ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థినుల వసతి గృహాన్ని విశాఖపట్నం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కెకెవి.బులికృష్ణ సోమవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ డి.ఝాన్సీసంజీవరాణి పాల్గొన్నారు.

గాజువాక పిహెచ్‌సి అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధిపై సోమవారం హాస్పిటల్‌లో అభివృద్ధి కమిటీ చర్చించింది. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలపై సభ్యులు చర్చించారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజాన రామారావు మాట్లాడుతూ, ఆసుపత్రిలో ఆపరేషన్ల సంఖ్య పెంచాలన్నారు. జోనల్ కమిషనర్ సింహాచలం మాట్లాడుతూ, ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తానన్నారు. కాలువలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ ఎజె.స్టాలిన్, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.



ఆసుపత్రి అభివృద్ధిపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

కొత్త అమావాస్య జాతర ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య నెలరోజుల జాతర సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారిని అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారి జాతరను వైసిపి నాయకులు దాడి జైవీర్ ప్రారంభించారు. ఆలయ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలంకరణతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద డిఎస్‌పి మల్ల మహేశ్వరరావు ఐదుగురు సిఐలు, 15 మంది ఎస్సైలు, 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు



పూజలు చేస్తున్న వైసిపి నాయకుడు జైవీరు తదితరులు

నూకాలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ నూకాంబిక అమ్మవారి పండగ మహోత్సవం సోమ, మంగళవారాల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ దాడి జగన్ తెలిపారు. 21న ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందెం ఏర్పాటు చేశామని, విజేతలకు రూ.20 వేలు, రూ.16 వేలు, రూ.13 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, 2 వేలు చొప్పున బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రదర్శనలో పాల్గొని గెలుపొందని వారికి రవాణా ఖర్చులు నిమిత్తం రూ.1000 చొప్పున ఇస్తామన్నారు. రాత్రి తొమ్మిది గంటలకు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. డప్పులు, పులి వేషాలు, భారీ మందు గుండు సామగ్రితో నూకాలమ్మ పండగ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ జగన్ తెలిపారు.

బుచ్చయ్యపేట : కొత్త అమావాస్య సందర్భంగా బుచ్చయ్యపేట మండలంలోని కెపి అగ్రహారంలో నూకలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. కేపీ అగ్రహారం, కొండపాలెం, పెద్ద మదిన, గున్నంపూడి, పైడమ్మపేట తదితర గ్రామస్తులు గ్రామదేవతల పండగ వలె ఈ జాతరను నిర్వహించుకుంటారు. మండలంలోని పలు గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాగజగదీష్

చంద్రబాబును కలిసిన నాగజగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు గెలుపు నేపథ్యంలో మంగళగిరిలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబుకు పుష్పగుచ్చాన్ని ఇచ్చి సాలువతో సత్కరించారు. పార్టీ క్యాడర్ సమన్వయంతో పనిచేసి విజయం సాధించినట్లు తెలిపారు. పిడిఎఫ్‌తో కలిసి తీసుకున్న నిర్ణయంతో రెండో ప్రాధాన్యత ఓటు తమ పార్టీకి కలిసి వచ్చినట్టు తెలిపారు.

అచ్చన్నను కలిసిన పీలా

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చన్నాయుడును మంగళగిరి పార్టీ కార్యాలయంలో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సోమవారం తన అనుచరులతో వెళ్లి కలిశారు. కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు అనకాపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి కార్యకర్తలతో కాఫీ విత్ కేడర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పీలా తెలిపారు. దీనికి మంచి స్పందన వస్తుందన్నారు. పీలా వెంట టిడిపి నాయకులు మళ్ల సురేంద్ర, పోలవరపు త్రినాథ్ ఉన్నారు.

అగ్నివీర్ వాయు నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపత్ పథకంలో భాగంగా అగ్ని వీర్ వాయు నియామకం కొరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు విశాఖపట్నం సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ అవివాహిత స్త్రీ పురుష అభ్యర్థుల నుంచి ఆన్లైన్ ద్వారా ఈనెల 17 నుంచి 31 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, డిప్లమో, ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు 2002వ సంవత్సరం డిసెంబర్ 26 నుంచి 2006 జూన్ 26వ తేదీ మధ్య జన్మించిన వారై ఉండాలని సూచించారు. ఆన్లైన్లో నమోదైన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని, ఆసక్తిగల అభ్యర్థులు https://agnipathvayu.cdac.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమస్యలపై సివిల్ సప్లై హమాలీల ధర్నా

ప్రజాశక్తి-కె.కోటపాడు

సివిల్ సప్లై హమాలీల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, రేషన్ షాపులు వద్ద సరుకుల దింపుడు కూలి చెల్లించాలని సివిల్ సప్లై హమాలీల సంఘం ప్రధాన కార్యదర్శి కె త్రినాధరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సివిల్ సప్లై గోడౌన్ వద్ద హమాలీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా త్రినాధరావు మాట్లాడుతూ హమాలీలు షాపులకు వెళ్లి బస్తాలు అన్లోడింగ్ చేసిన వాటికి గత 20 సంవత్సరాలు నుండి హమాలీలకు డీలర్లు కూలి చెల్లించేవారని తెలిపారు. కాని ఇప్పుడు ఆ కూలి ఇవ్వలేమని డీలర్లు చెబుతున్నారని, సివిల్ సప్లై అధికారులు తమ చేత ఏదో విధంగా పని చేయించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల నుండి జిల్లాలో రిటైర్ అయిన వారికి, చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు పిఎఫ్ చెల్లించడం లేదన్నారు. కొత్తగా చేరిన హమాలీలకు



నినాదాలు చేస్తున్న సివిల్ సప్లై హమాలీలు

పిఎఫ్ నెంబర్లు ఇవ్వడం లేదన్నారు. హమాలీలకు గత 13 నెలల నుండి బకాయి ఉన్న ఎరియర్స్, దసరాకు బట్టలు ఇప్పించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో భక్తి దేవుడు బాబు, గజ్జి ఈశ్వరరావు, దమ్ము గంగరాజు, పైడిరాజు, వెంకటరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సేవ సహకార సంస్థ ద్వారా అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ రైతాంగం అమృత జల ధార పథకం కింద రెండున్నర ఎకరాల భూమి ఉన్న రైతుకు 50 వేల రూపాయల రాయితీ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్ నెంబర్ జత చేయాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 21 నుంచి 48 సంవత్సరాల వయసు గల నిరుద్యోగులకు వివిధ పథకాలకు 60 వేల రూపాయల రాయితీ అందించడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువత ఆటోలు ట్రాన్స్పోర్ట్ వాహనాలు, కిరాణా, గాజుల దుకాణం, టెంట్ హౌస్, ఫొటోస్ షాపు, మెడికల్ ల్యాబ్ వంటి పథకాలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 27 లోగా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, ఇతర వివరాలకు 8317559817 నెంబర్ను సంప్రదించాలని కోరారు.

ఆక్రమణలకు పాల్పడిన రాంకీపై డిఆర్‌ఒకు ఫిర్యాదు


ప్రజాశక్తి- పరవాడ

పరవాడ మండలంలోని ఫార్మసిటీలో అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్న బోరు వెల్స్ వెంటనే మూసివేయాలని, తాడి సర్వే నెంబర్ 116లో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. తానం గ్రామానికి పక్కనే రసాయనిక వ్యర్థ జలాలను నిల్వ చేయడానికి తవ్విన చెరువును మూసివేయాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిబంధనలను ఉల్లంఘించి తవ్వకాల సాగిస్తున్న బోర్లను వెంటనే మూసివేసి సమగ్ర విచారణ చేయాలని కోరారు. ఫార్మ పక్కనే ఉన్న గ్రామాల్లో కాలుష్యం తీవ్రంగా పెరిగిందని తాడి గ్రామం తరలింపుకు చర్యలు చేపట్టాలని, లంకెలపాలెం, బొద్దపువని పాలెం, సాలాపు వాణి పాలెం, పరవాడ, కాలుష్యంతో అల్లాడుతున్నాయని జాయింట్ కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో సిఐటియు నేత గనిశెట్టి కోరారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు గనిశెట్టి

పోషణ్ పక్వాడా పక్షోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, డిఎంహెచ్‌ఒ, డిఆర్‌ఒ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ నెల 20 నుంచి ఏప్రిల్ మూడో తేదీ వరకు జరిగే పోషన్ పక్వాడ పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ రవి పటాన్ శెట్టి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం పోషన్ పక్వాడ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతల్లో పోషక లోపాలను నివారించడమే పోషణ్ పక్వాడ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023గా ప్రకటించిన నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో చిరుధాన్యాలను ప్రతి ఒక్కరు వినియోగించడం ద్వారా తమ ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవాలని సూచించారు. చిరుధాన్యాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జెసి కల్పనా కుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ, జిల్లా మహిళా మరియు శిశు అభివద్ధి సాధికారత అధికారి జి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా డేవిడ్

ప్రజాశక్తి-చోడవరం



చోడవరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాండ్రేగుల డేవిడ్ ఎన్నికయ్యారు. సోమవారం కోర్టు ఆవరణలో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుతం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న పోతల ప్రకాష్ రావుపై డేవిడ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా డేవిడ్‌ను పలువురు న్యాయవాదులు, రాజకీయ ప్రముఖులు అభినందించారు.

వ్యవసాయేతర రుణాలు అందజేత

ప్రజాశక్తి- మునగపాక రూరల్

వ్యవసాయ రుణాలతోపాటుగా వ్యవసాయేతర రుణాలను కూడా సహకార సంఘం ద్వారా అందించడం జరుగుతుందని స్థానిక పిఏసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్ రావు తెలిపారు. స్థానిక సహకార సంఘంలో గల ముగ్గురు సభ్యులకు సోమవారం రూ.13 లక్షల చెక్కులను రామ్మోహన్రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘ సభ్యులకు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని, సన్న, చిన్న కారు రైతులు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ఆడారి వేణుగోపాలకృష్ణ, పివి మహేశ్వరరావు పాల్గొన్నారు.



రుణాలు అందజేస్తున్న పిఏసిఎస్ అధ్యక్షులు

స్పందనకు 207 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలకు సంబంధించి 207 అర్జీలు వచ్చాయి. వీటిని కలెక్టర్ రవి పటాన్ శెట్టి, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుదూత స్పందనలో వచ్చే అర్జీలను నాణ్యతతో అధికారులు పరిశీలించి నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. స్వీకరించే ప్రతి దరఖాస్తుకు 24 గంటల్లో పరిష్కారమా తిరస్కారమా అనేది దరఖాస్తుదారునికి తెలియజేయాలన్నారు. తిరస్కరిస్తే సరైన కారణాలు చెప్పాలని సూచించారు. మండల స్థాయిలో కూడా క్వాలిటీ డిస్పోజల్ పెరగాలన్నారు. అధికారులు నిర్లక్ష్య ధోరణితో కాకుండా జవాబుదారీ తనంతో ఉండాలని, ప్రతి దరఖాస్తు నిర్ణీత వ్యవధికి లోబడి పరిష్కరించాలని ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ లావణ్య అన్నారు. స్థానిక భీముని గుమ్మం ప్రాథమిక పాఠశాలలో సోమవారం వ్యాధుల పట్ల విద్యార్థులకు డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సీజన్లో తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, జీవన విధానం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వైరల్ ఫీవర్, జలుబు, దగ్గు వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. వీటిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం-2లో ఆధార్ సేవలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి సచివాలయం-2లో ఆధార్ సేవలను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు చేరువలో అన్ని రకాల సదుపాయాలను అందించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. దేవరాపల్లి మండలంలోని వేచలం, కాశీపురం, ఏ. కొత్తపల్లి, దేవరాపల్లి సచివాలయం-2 లో ఈ ఆధార్ కేంద్రాలు ప్రారంభం జరిగిందన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కష్ణమూర్తి, వీఆర్వో నూకరాజు, పంచాయతీ కార్యదర్శులు ఎస్ శ్రీనివాస్, పి నాగరత్నం, డిజిటల్ అసిస్టెంట్ సిహెచ్ రోజా తదితరులు ఉన్నారు.

సింహాచలం నాయుడు మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి గ్రామానికి చెందిన జామి సింహాచలంనాయుడు (28) ఆదివారం శారదానది ఒడ్డున చెట్టుకొమ్మకు ఉరితో వేలాడుతూ మృతి చెందిన సంఘటనపై పోలీసులు సమగ్రమైన, నిష్పక్షపాతంగా విచారణ చేసి ప్రజలు, మృతుని కుటుంబ సభ్యుల అనుమానాలను నివృత్తి చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తన కుమారుడిని ఎవరో ఉరివేసి శారదా నది ఒడ్డున చెట్టుకొమ్మకు వేలాడ దీశారని, తన బిడ్డ మృతికి కారణాలు వెలుగు తీయాలని ఆదివారం మృతుని తల్లి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయాన్ని వెంకన్న ప్రస్తావించారు. సింహాచలంనాయుడు మృతికి ప్రేమ వ్యవహారమే కారణమై ఉంటుందని పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు.

వేడుకగా రాట మహోత్సవం

ప్రజాశక్తి -మునగపాక రూరల్

మండలంలోని తోటాడ గ్రామంలో భావనారుషి భద్రావతి, కాశీ విశ్వేశ్వర ఆలయంలో వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా సోమవారం రాట మహోత్సవం వేడుకగా నిర్వహించారు. అర్చకులు నిర్దేశించిన ముహూర్తానికి రాట కార్యక్రమం చేపట్టారు. పద్మశాలి సేవా సంఘం నిర్వహణలో ఈనెల 22వ తేదీ బుధవారం సాయంత్రం 7 గంటలకు స్వామివారి కళ్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డి ఆదినారాయణ, కాకి అప్పారావు, నూకలక్ష్మి నారాయణ, సూరిబాబు, బాబూరావు, జగదీశ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అకౌంట్ నుంచి నగదు మాయం

ఆందోళనలో ఖాతాదారులు

ప్రజాశక్తి- వడ్డాది

బ్యాంకు అకౌంట్ నుండి నగదు మాయం కావడంతో ఖాతాదారుల ఆందోళన చెందుతున్నారు. కొంతమందికి ఆధార్ ద్వారా నగదు విత్ డ్రా అయినట్లు సంక్షిప్త సమాచారాలు వస్తున్నాయి. కొంతమందికి ఏ సమాచారం లేకుండానే అకౌంట్లో నగదు కట్ అవుతుంది. బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేసుకున్నప్పుడు నగదు తక్కువగా ఉందని తెలుసుకొని ఖాతాదారులు బ్యాంకుల వైపు పరుగులు తీస్తున్నారు. ఆధార్ ద్వారా వేలిముద్రలు తీసుకొని విత్ డ్రా చేసుకున్నారని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. కొన్ని రోజులుగా బ్యాంకులకు ఇటువంటి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి.

బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్టకు చెందిన కొట్యాడ మంగపతికి ఎస్‌బిఐలో ఖాతా ఉంది ఒక సారి రూ.10 వేలు, ఒకసారి రూ.4 వేలు విత్‌డ్రా అయ్యాయి. తన అకౌంటులో నగదు తక్కువగా ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే బ్యాంక్ కాల్ సెంటర్ కి ఫోన్ చేసి సంప్రదిస్తే ఆధార ద్వారా ఖాతాలో డబ్బులు విత్ డ్రా చేసినట్లు సమాధానం వచ్చింది. తాను బయట ఎటిఎం, ఆధార్, వాణిజ్య కేంద్రాల్లో వేలిముద్రలు వేసి డబ్బులు తీసుకోలేదని, అలాంటప్పుడు తన ఖాతా నుంచి డబ్బులు ఎలాగా కట్ అయ్యాయని బాధితుడు లబోదిబోమంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన కడియం శ్రీను ఎస్బిఐ ఖాతా నుండి రూ.2200 కట్ అయిపోయాయి. ఆధార్ ద్వారా డబ్బులు తీసుకున్నట్లు ఆయన ఫోన్‌కి సమాచారం వచ్చింది. వెంటనే బ్యాంక్ కాల్ సెంటర్ కి ఫోన్ చేసి సంప్రదిస్తే డబ్బులు కట్ అయినది వాస్తవమేనని తెలిసింది. ఆధార్ ద్వారా తను డబ్బులు విత్ డ్రా చేయలేదని ఆయన చెబుతున్నారు. వడ్డాది గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం ఖాతా నుంచి 2200, ఆది చంద్రరావు ఖాతా నుండి రూ.2300 కట్ అయ్యాయి. ఎస్బిఐ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న ఒకరి ఖాతాలో రూ.10 వేలు మాయమయ్యాయి. సాధారణంగా ఖాతాలో నగదు విత్ డ్రా చేసినప్పుడు ఎక్కడి నుంచి చేస్తున్నారో తెలుస్తుంది. ఏటీఎం, ఆధార్, వాణిజ్య సహాయక పాయింట్లులో నగదు విత్ డ్రా చేసినప్పుడు సంబంధిత చిరునామా వస్తుంది. వీరి ఖాతాలో నగదు ఎక్కడినుండి డ్రా చేస్తున్నారు అనే విషయం తెలియడం లేదు. ఖాతాల్లో నగదు డ్రా చేసినప్పుడు ఒక రిఫరెన్స్ నెంబర్ వస్తుంది. ఆ రిఫరెన్స్ నెంబర్ ఎక్కడ నుంచి వస్తుందో బ్యాంక్ అధికారులు చెప్పలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలా మెసేజ్‌లు రాకుండా డబ్బులు కట్ అవుతున్న బాధితులు చాలా మంది ఉన్నట్లు తెలుస్తోంది.

ఈదురు గాలులు, భారీ వర్షం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భారీ స్థాయిలో ఈదురు గాలులు వీచాయి. సాయంత్రం భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుండి వాతావరణం చల్లగా ఉండి చెదురు మదురు చిరుజల్లుల కురిశాయి. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారీగా వాతావరణంలో మార్పులు సంభవించి ఈదురుగాలులు వీయడంతో మండలంలోని పలు గ్రామాలలో పంట పొలాలలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఈదురు గాలులు వల్ల చెరుకునాట్లు వేయడానికి సిద్ధంగా ఉంచుకున్న చెరుకు దవ్వతోటలు నేలకొరిగాయి. సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు బుచ్చయ్యపేట, చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి, కందిపూడి, రాజాం, పెదపూడి, సీతయ్యపేట తదితర గ్రామాలలో భారీ వర్షం కురిసింది

వాహనాల రాకపోకలకు అంతరాయం

వడ్డాది : బుచ్చియపేట మండలం విజయరామరాజు మెయిన్ రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం వీచిన ఈదురు గాలులకు ప్రధాన రహదారిపై తాటి చెట్టు నేలకొరిగింది. దీంతో వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బంది పడ్డారు. విషయం తెలుకున్న బుచ్చయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు జంగిల్ క్లియరెన్స్ చేయించి వాహనాల రాకపోకలకు మార్గం సుమగం చేశారు.



చిరంజీవిరావును అభినందిస్తున్న రామానాయుడు తదితరులు

చిరంజీవిరావుకు అభినందనలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసి విజయం సాధించిన వేపాడ చిరంజీవిరావును టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు గవిరెడ్డి రామానాయుడు సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శాలువుతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట టిడిపి దేవరాపల్లి, చీడికాడ మండలాల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పాతల చిన్నం నాయుడు, జైతవరం ఎంపీటీసీ పైలా ముత్యాల నాయుడు ఉన్నారు.

మునగపాక రూరల్ : వేపాడ చిరంజీవిరావుకు టిడిపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం టిడిపి మండల నాయకులు పుష్ప గుచ్ఛం అందజేసి సాలువులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, మల్ల వరాహ నరసింహారావు, దాడి శివ, బొడ్డేటి ప్రసాద్ పాల్గొన్నారు.

వర్షాలకు ఒరుగుతున్న విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - యలమంచిలి

రెండు రోజులుగా కురుస్తున్న చెదురు ముదురు వర్షం జల్లులకు విద్యుత్ స్తంభాలు ఒరుగుతున్నాయి. ఈ రెండు రోజుల్లో అడపా దడపా ఒరిగిన విద్యుత్ స్తంభాల మూలంగా పట్టణంలో గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం జరిగింది. మరికొన్ని చోట్ల ఒరుగుతున్న వీధిస్తంభాలు వీధి వాసుల్ని భయపెడుతున్నాయి. ఇటీవల పట్టణంలో బృహత్ నీటి సరఫరాకు పైపులైన్లు వేశారు. పైపులు వేయడానికి రోడ్డు పక్కగా మూడు అడుగుల కాల్వలు తవ్వి అందులో పైపులు వేసి కప్పేరు. కప్పేటప్పుడు మట్టి లూజుగా వేయడంతో ఆ కాల్వ లైన్లలో ఉన్న విద్యుత్ స్తంభాలు గుల్లబారాయి. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు అవి ఒరుగుతున్నాయి. ప్రమాదాలు జరగక ముందే ఒరుగుతున్న స్తంభాలను పటిష్టపరచాలని ఆయా ప్రాంత వాసులు మున్సిపల్, విద్యుత్ అధికార్లను కోరుతున్నారు.



రాంనగర్ ప్రధాన రహదారిలో ఒరిగిన విద్యుత్ స్తంభం

'నా కుమారుని మృతిపై విచారణ జరపండి'



తహశీల్దారు కార్యాలయం వద్ద మృతుని బంధువులు, మహిళలు

ప్రజాశక్తి-చోడవరం

తన కుమారుడి మృతిపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని చోడవరం రెల్లివీధికి చెందిన పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు సామాధుల కృప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయానికి కృపతో పాటు ఆమెకు సంఘీభావంగా స్థానిక మహిళలు వచ్చారు. ఈ సందర్భంగా కృప స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఫిబ్రవరి 24వ తేదీన తన కుమారుడు సమాధుల రవితేజ మృతదేహం గజపతినగరం మెయిన్ రోడ్డు వద్ద పడి ఉందని, దీనిని రోడ్డు ప్రమాదంగా పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. అయితే తన కుమారుడు మృతి చెందిన రోజున చోడవరం తహశీల్దారు కార్యాలయంలో ఓ వ్యక్తితో తన కుమారుడికి తగాదా జరిగిందని, ఆ నేపథ్యంలోనే హత్య జరిగి ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై చోడవరంకు చెందిన తుపాకుల లోకేష్, ఏసుపైనా, తహశీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తిపైనా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అయినా ఇంత వరకు ఇటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన కొడుకు మృతదేహంపై అనేక చోట్ల కొట్టిన గాయాలు కనబడ్డాయని, ఇది ముమ్మాటికీ హత్యేనని పేర్కొన్నారు. దీనిపై తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను శిక్షించి, తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

డిక్కీ చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

కొన్ని రోజులుగా స్కూటీ, బైక్‌లకు సంబంధించి డిక్కీలో చోరీలు జరుగుతున్నాయని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ డి.నాగేంద్ర అన్నారు. సోమవారం ఆయన ఎ క విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం కొత్తవలసలో స్కూటీ డిక్కీలో పెట్టిన సుమారు రూ.6 లక్షలు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించడం జరిగిందని తెలిపారు. ఇటీవల సామర్లకోట దగ్గర డిక్కీలో నుంచి రూ.8 లక్షలు దొంగలించడం జరిగిందని వెల్లడించారు. దేవరాపల్లిలో డిక్కీలో ఉంచిన సుమారు లక్ష రూపాయల వరకు 15 రోజులు కిందట అపహరణకు గురైందని పేర్కొన్నారు. అందువల్ల ఎవరైనా మీ చుట్టుపక్కల అనుమానాస్పదంగా బ్యాంకులు దగ్గర కనబడితే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నాగేంద్ర కోరారు.

గృహిణులకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి- మునగపాక రూరల్

నేటి గృహిణులు పడుతున్న శ్రమను గుర్తించి, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మ్యాజిక్ బస్సు సంస్థ అందజేసిన ప్రశంసా బహుమతులను సోమవారం మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో పోటీ పడటం శుభపరిణామన్నారు. మహిళలు ఉద్యోగినిగా, గృహిణిగా కుటుంబాలలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మ్యాజిక్ బస్సు సంస్థ చేస్తున్న పలు సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, ఏఎన్ఎం రమణి, మ్యాజిక్ బస్సు సంస్థ నిర్వాహకులు గోవిందు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

22న తన్మయి ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తన్మయి క్రియేటివ్స్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన ఈ నెల 22న ఉగాది సంబరాలు నిర్వహించనున్నామని, ఐదుగురు ప్రముఖుల సేవలను, ప్రతిభను గుర్తించి పురస్కారాలు అందజేయనున్నామని ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బిఎస్.చంద్రశేఖర్, సిహెచ్‌వి.సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో తన్మయి క్రియేటివ్స్ వ్యవస్థాపక సభ్యురాలు శారద, దేశంలోనే తొలి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి, సాంస్కృతిక సంస్థల వారధి కొణతాల రాజు, న్యాయవాది హరిమెహర్ పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేషన్‌కు నాలుగు కేంద్రాలు

ప్రజాశక్తి-గొలుగొండ : ఆధార్ అప్‌డేషన్‌కు మండలంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ డేవిడ్‌రాజు తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ కార్డులో చేర్పులు మార్పులకు, అప్‌డేషన్ చేయాల్సి ఉందన్నారు. మండలంలో ఏఎల్‌పురం, గొలుగొండ, గుండుపాల, పుత్తడిగైరంపేట సచివాలయాల్లో ఆధార్ అప్‌డేషన్ పనులు మంగళవారం నుండి ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కేంద్రాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఉదయం నుంచి అందుబాటులో ఉంటారని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్పందన ఫిర్యాదులు సత్వర పరిష్కారం చూపుతామని నర్సీపట్నం ఆర్‌డిఒ హెచ్‌ఐవి. జయరాం అన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలువురు అర్జిదారులు హౌసింగ్ బిల్లులు చెల్లించాలని వినతిపత్రం ఇవ్వగా, వెంటనే సంబంధిత హౌసింగ్ అధికారులతో మాట్లాడి, నిర్మాణాల ప్రాప్తికి ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ సమస్యలపై వచ్చిన వినతులు పరిశీలించి,. సాధ్యమైనంత త్వరగా స్పందన అర్జీలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌ఎఎస్ దేశానికి అంకితం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: ఐసిఎఆర్-సిఎంఎఫ్‌ఆర్‌ఐ విశాఖపట్నం రీసెర్చ్ సెంటర్ ఫిన్ ఫిష్‌ల నర్సరీ పెంపకం కోసం దేశీయంగా అభివృద్ధి చేసిన రీ సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్ (ఆర్‌ఎఎస్)ను ఐసిఎఆర్-సిఎంఎఫ్‌ఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణన్ సోమవారం దేశానికి అంకితం చేశారు. విశాఖ బీచ్ రోడ్డులోని సిఎంఎఫ్‌ఆర్‌ఐ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆర్‌ఎఎస్ ద్వారా 12 గ్రాముల చేప విత్తనాన్ని రూ.11.20కే ఉత్పత్తి చేయగలమన్నారు. ఇది భారతీయ సముద్ర వ్యవసాయానికి ఆర్థికంగా ఉపయోగ పడుతుందని తెలిపారు. గతంలో ఉపయోగించిన నీటిని రీ సర్క్యులేట్ చేస్తూ బ్రూడ్‌స్టాక్ డెవలప్‌మెంట్ బ్రీడింగ్ కోసం ఆర్‌ఎఎస్ వ్యవస్థను అభివృద్ధి చేశామన్నారు. దేశంలోనే సముద్రతీర పరిశోధనలో ఇదొక కీలక పురోగతి అని, పారిశ్రామికవేత్తలు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు మార్గం సుగమం చేస్తుందని అన్నారు. అనంతరం సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కి చెందిన రైతుల శిక్షణ హాస్టల్ 'ఇండియన్ పాంపనో'ను ఆయన ప్రారంభించారు. ఈ క్రమంలోనే మూడు అవగాహనా ఒప్పందాలు జరిగాయి. ఎంఎస్‌ఆర్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్‌తో భారతీయ పాంపనో కోసం బ్రూడ్‌స్టాక్ డెవలప్‌మెంట్, సీడ్ ప్రొడక్షన్ టెక్నాలజీ కోసం, రేవతి బండారుతో భారత పాంపనో సముద్రపు పంజర పెంపకంపై సాంకేతిక సేవల కోసం, లయ స్వచ్ఛంద సంస్థతో సముద్రపు పాచి సాగులో సాంకేతిక సేవల కోసం ఈ ఒప్పందాలు చేసుకున్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఆర్‌సి డాక్టర్ జె.చార్లెస్ జీవా, డాక్టర్ శుభదీప్ ఘోష్ పాల్గొన్నారు.



ఆర్‌ఎఎస్‌ను దేశానికి అంకితం చేస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎ.గోపాలకృష్ణన్

జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన



సిహెచ్.నాగాపురంలో పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ మండలం సిహెచ్.నాగాపురం గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.33 లక్షలు నిధులతో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగు నీరు అందించే పైపులైన్ నిర్మాణం పనులను సోమవారం సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు, ఎంపిపి గజ్జలపు మణికుమారితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని ఇళ్లకు కుళాయిల ఏర్పాటు ద్వారా తాగునీటిని అందించే ఉద్దేశంతో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ద్వారా పంచాయతీకి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ వేసవిలో తాగునీరు అందించే వీలుగా పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, వైసిపి నాయకులు గంటల బుచ్చిబాబు, అప్పన్న, దివాణం, చివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉప్పుటేరులో భారీగా చేపలు మృత్యువాత

హెటిరో వ్యర్థ జలాలే కారణమని మత్స్యకారుల ఆందోళన

తహశీల్దార్, ఎస్‌ఐలకు ఫిర్యాదు

సంఘటనాస్థలిని పరిశీలించిన సిఐ, ఎస్‌ఐ



ఉప్పుటేరులో నీటిపై తేలాడుతున్న చనిపోయిన చేపలు

ప్రజాశక్తి,- నక్కపల్లి : మత్స్యకారులు ఆందోళన చెందినదంతా జరుగుతోందని వారు ఆవేదన చెందుతున్నారు. హెటిరో వ్యర్థ రసాయన జలాలు ఉప్పుటేరులో వదలడం వలన చేపలు మత్యువాత పడ్డాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట సమీపంలో హెటిరో కంపెనీ రసాయన వ్యర్థ జలాలను ఈనెల 18 ,19 తేదీల్లో కురిసిన వర్షానికి, వర్షం నీటితో పాటుగా కంపెనీ పక్కన గల ఉప్పుటేరులో వదిలేశారని, దీంతో ఉప్పు టేరులో టన్నులకొద్దీ చేపలు మృత్యువాత పడ్డాయని మత్స్యకారుల ఆరోపిస్తున్నారు. దీని కారణంగా ఉపాధి కోల్పోయే పరిస్థితులు ఉత్పన్నమౌతున్నాయని వారంతా ఆవేదన చెందుతున్నారు. దీంతో బాధ్యులపై కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ మత్స్యకారులు సోమవారం ఇన్‌ఛార్జి తహసీల్దార్ నీరజ, ఎస్‌ఐ శిరీషలకు ఫిర్యాదు చేశారు.

మత్స్యకారుల ఫిర్యాదు మేరకు సిఐ నారాయణరావు, ఎస్‌ఐ శిరీష సోమవారం మత్స్యకారులతో కలిసి ఉప్పుటేరును సందర్శించి మృతి చెందిన చేపలను పరిశీలించారు ఈ సందర్భంగా హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా జరుగు నష్టాలను .సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, స్థానిక మత్స్యకారులు సిఐ, ఎస్‌ఐలకు వివరించారు. .హెటిరో కంపెనీ నుండి వెలువడే కాలుష్యం కారణంగా తమ ఉనికికి ప్రమాదం పొంచి ఉందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పుటేరులో ఇంత పెద్ద ఎత్తున చేపలు మృత్యువాత పడితే తామంతా ఎలా జీవనం సాగించాలని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా సముద్రం నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, చేపలు వేట తప్ప మరో వృత్తి తమకు తెలియదన్నారు. హెటిరో కాలుష్యం కారణంగా తమ బతుకులు ఆగమ్యగోచరంగా మారాయన్నారు.ఈ ప్రాంతంలో నివసించలేని దుస్థితి నెలకొందన్నారు .అధికారులు స్పందించి హెటిరో కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీ వ్యర్థ జలాలు సముద్రం, ఉప్పుటేరులోకి వదలకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకారులు గోసల సోమేశ్వరరావు, మహేష్‌బాబు, గంగరాజు రమణ, దాగ్రాజు, బాపూజీ, కోటి తాతాజీ , సోమేశ్, కాశి, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు .



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నేతలు, మత్స్యకారులు

పోషణ అభియాన్ పథకంతో ఆరోగ్య ప్రయోజనాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోషకాహార లోపం, రక్తహీనత, తక్కువ బరువును అధిగమించేందుకు పోషణ అభియాన్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'పోషణ అభియాన్ పథకం'లో పోషణ పంచాయతీలను సిద్ధపరచడంలో సర్పంచ్‌ల పాత్రపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ్ అభియాన్ పథకం ద్వారా యుక్తవయస్సులో ఉన్న బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, 0-6 సంవత్సరాల వయస్సు నుంచి పిల్లల పోషకాహార స్థితిపై దృష్టిపెట్టనున్నామన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరి, రీజినల్ ఆర్గనైజర్ మాధవి వర్మ, కేర్ ఇండియా సభ్యులు సుబ్రహ్మణ్యం, వాసవి విల్లా, మహిళా కమిషన్ సభ్యురాలు దేవి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల మహిళా సర్పంచులు, గ్రామస్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగతనాలపై జాగ్రత్త అవసరం

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : వాహనాల్లో డిక్కీల్లో పెట్టిన నగదు, విలువైన వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయే ఘటనలు జరుగుతున్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఎస్‌ఐ పి.ప్రసాదరావు సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో మేనేజర్, ఖాతాదారులకు బ్యాంకులు, ఇతర ప్రదేశాల్లో దొంగతనాలపై అవగాహన కల్పించి అప్రమత్తం చేశారు. బ్యాంకుల్లో పెద్దమొత్తంలో నగదు విత్‌డ్రా చేసిన ఖాతాదారులకు ఇటువంటి దొంగతనాలపై అప్రమత్తం చేయాలని బ్యాంకు సిబ్బందిని కోరారు. నగదు విత్‌డ్రా చేసిన తర్వాత బైక్‌ల డిక్కీలు, ముందున ఆయిల్ ట్యాంకుపై ఉన్న కవర్లులోగానీ, లేదంటే కార్లు, ఇతర వాహనాల్లో నగదు బ్యాగ్‌లను ఉంచి, తర్వాత ఏదైనా అవసరం నిమిత్తం అక్కడి నుంచి వేరే చోటుకు వెళితే, అదేపనిగా ఉన్న దొంగలు పసిగట్టి దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నందున తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బ్యాంకు లోపల, బయట సిసి కెమెరాలు ఏర్పాటుతోపాటు వాటి పనితీరును ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించారు.

వారపుసంత ఆశీలు వసూలుకు వేలం

ప్రజాశక్తి-నక్కపల్లి : నక్కపల్లి వారపు సంతలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ఆశీలు వసూలు చేసుకునే హక్కును పొందడానికి మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎంపిపి రత్నం, ఎంపిడిఒ సీతారామరాజు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. నక్కపల్లికి చెందిన దేవవరపు కొండలరావు రూ.16.38 లక్షలకు వేలంపాట దక్కించుకున్నట్లు ఎంపిడిఒ సీతారామరాజు తెలిపారు. వేలంపాటలో 29 మంది పాటదారులు పాల్గొన్నారన్నారు. గత ఏడాది రూ.16 లక్షల 2 వేలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు కార్యక్రమంలో వైస్ ఎంపిపి వీసం నానాజీ , పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు .

పారదర్శకంగా సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2021-22 సంవత్సరంలో గామీణ ప్రాంతాల్లో జరిగిన ఉపాధి పనులు, పలు సంక్షేమ పథకాల సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపిడిఒ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో సోషల్ ఆడిట్ బృందంతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఈనెల 21 నుంచి 30 వరకు గ్రామీణ ప్రాంతాల్లో జరుగు సోషల్ ఆడిట్‌కు ముందస్తుగా సచివాలయాలకు సమాచారం అందించి తనిఖీలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు, ఎపిఒ గంగు నాయుడు మాట్లాడుతూ రోజుకు మూడు గ్రామాలు చొప్పున సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సోషల్ ఆడిట్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ప్రేమ్ కుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సత్వరమే అభివృద్ధి పనులు పూర్తి

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో సచివాలయాలకు వచ్చిన ప్రత్యేక నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులను సోమవారం ఎంపిడిఒ డేవిడ్‌రాజు పరిశీలించారు. గొలుగొండ, జోగంపేట, పప్పుశెట్టిపాలెం తదితర పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన సచివాలయ నిధులతో ప్రారంభించిన పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. గొలుగొండ కేజీబీవీ విద్యాలయంకు ఆనుకొని నిర్మించిన డ్రైనేజీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు



బహుమతులు పొందిన విద్యార్థులతో సిఐ, ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి -యస్. రాయవరం : మండలంలో కొరుప్రోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ మోడల్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక సిఐ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడంతోపాటు, పరీక్షలంటే వారిలో భయం పోగొట్టేందుకు ఇటువంటి నమూనా పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, మంచి మార్కులతో ఉత్తీర్ణులై భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు దిశా చట్టంపై అవగాహన కల్పించారు

ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఎం రమణ మాట్లాడుతూ ఇలాంటి నమూనా పరీక్షల్లో ప్రతి ఒక్క విద్యార్థి ఉపయోగించుకోవాలని సూచించారు. పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం పురుషోత్తం, ప్రజ్ఞా కాలేజీ ప్రిన్సిపాల్ నూకరాజు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బి.బాబ్జి, సహాయ కార్యదర్శి బాలాజీ పాల్గొన్నారు.

న్యాయవాదిపై దౌర్జన్యం హేయం



కోర్టు ముందు నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: విజయవాడలో సీనియర్ అడ్వకేట్‌పై పోలీసులు దౌర్జన్యం చేశారని నిరసిస్తూ సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నర్సీపట్నంలోని న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ముందు నిరసన చేపట్టారు.దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీనియర్ అడ్వకేట్ పొక్కునూరి నరసింహం డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో నర్సీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు రావాడ సత్యనారాయణ. సెక్రెటరీ యల్. లోవరాజు, ట్రెజరర్ గోవర్ధనగిరి, జాయింట్ సెక్రెటరీ కొరుప్రోలు వెంకటరమణ, ఉపాధ్యక్షులు సూరిబాబు, లైబ్రేరియన్ అనిమిరెడ్డి గోవిందా, సీనియర్ అడ్వకేట్ పొక్కునూరి నరసింహం, మాకిరెడ్డి బుల్లిదొర తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

పార్కు సంరక్షకులకు బియ్యం పంపిణీ



బియ్యం అందజేస్తున్న శ్యామల వరలక్ష్మి

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో పనిచేస్తున్న చినబాబు, నాగమణి, ఎలమ్మ ముగ్గురు సంరక్షకులకు అల్లూరి సీతారామరాజు సేవా సంఘం అధ్యక్షురాలు శ్యామల వరలక్ష్మి సోమవారం 50కిలో బియ్యం అందించారు. ఈ సందర్భంగా వరలక్ష్మీని పార్కు సంరక్షకులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల ఆగ్రహ జ్వాల

- పలుచోట్ల ర్యాలీలు, రాస్తారోకోలు, వినతుల అందజేత
- అనకాపల్లిలో సిఐటియు నేతల అరెస్టు, విడుదల
- సమస్యలను పరిష్కరించాలని డిమాండ్



నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నేతలు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్లు చలో విజయవాడ కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం నిర్బంధానికి దిగడంపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో అంగన్వాడీలు, సిఐటియు నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

(ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం)

అనకాపల్లి: అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వ నిర్బంధకాండపైనా, పోలీసులు చేపట్టిన హౌస్ అరెస్టులకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. రాస్తారోకో కారణంగా నెహ్రూచౌక్ జంక్షన్‌లో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. దీంతో అంగన్వాడీలు తీవ్రంగా ప్రతిఘటించి అడ్డుకున్నారు. చేసేది లేక పోలీసులు అరెస్టు చేసిన నాయకులను విడుదల చేశారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో చలో విజయవాడ వెళ్తున్న అంగన్వాడీ వర్కర్లను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి గ్రాట్యూటీ చెల్లించాలని, తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా చెల్లిస్తామని ఇచ్చిన ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ యూనియన్ జిల్లా కోశాధికారి వివి రమణమ్మ, నాయకులు కాసులమ్మ, ఉమా, రామలక్ష్మి, లీల, భాగవతి, అధిక సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రాంబిల్లి : అంగన్వాడీలపై నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అంగన్వాడీల సమస్యలపై తహశీల్దారు భాగ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు మాట్లాడుతూ అంగన్వాడీలకు గత ఐదు సంవత్సరాలుగా ఇవ్వాల్సిన టిఏ, డిఏ చెల్లించాలని, బిల్లులు ఇవ్వాలని కోరారు. పని భారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ, అధికారుల వేధింపులు, అవమానాలు ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి : న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ ఆందోళనకు వెళుతున్న అంగన్వాడీలు, సిఐటియు నేతలను పోలీసులు దుర్మార్గంగా నిర్బంధించడం, అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ నీరజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మి రాజ్యం, సత్యవేణి, పరంజ్యోతి, విజయ, పద్మ, భువనేశ్వరి, జయలక్ష్మి, రమణి, రత్నకుమారి,లలిత పాల్గొన్నారు.

గొలుగొండ : చలో విజయవాడ ఆందోళనకు వెళుతున్న అంగన్వాడీ అక్రమ అరెస్ట్, నిర్బంధాలను నిరసిస్తూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు భ్రమరాంభ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ (విశాఖపట్నం) : తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఉద్యమిస్తున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీసులు నిర్బంధించడం దుర్మార్గమని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. పోలీసుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జగదాంబ సెంటర్ నుంచి వాచ్ హౌస్ జంక్షన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడి నుంచి జగదాంబ జంక్షన్ వరకూ వచ్చి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడారు. రాజ్యాంగం ఇచ్చిన నిరసన తెలియజేసే హక్కును జగన్ కాలరాస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా నాయకులు బి.జగన్, జి.అప్పలరాజు, కె.కుమార్ మంగళం, ఎం.సుబ్బారావుతో పాటు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సుజాత, శ్రీదేవి, రమా, నూకాలమ్మ, శ్రావణి, సంతోష్ కుమార్, భవాని, దుర్గా, పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గొలుగొండలో వినతిపత్రం అందజేత



రాంబిల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

నేతల హౌస్ అరెస్టు





కె.కోటపాడు, కశింకోటలలో నిర్బంధంలో నేతలు

కె.కోటపాడు: ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) చలో విజయవాడకు పిలుపునిచ్చిన నేపథ్యంలో అంగన్వాడీలపై పలు నిర్బంధం ప్రయోగించారు. సోమవారం తెల్లవారుజాము నుండే కె.కోటపాడు, ఎ.కోడూరు పోలీసులు మండలంలోని అంగన్వాడీ వర్కర్లను వారి ఇళ్ల వద్దనే ముందస్తుగా గహ నిర్బంధం చేశారు. పోలీసుల నిర్బంధ చర్యలను సిపిఎం మండల కార్యదర్శి రొంగల ముత్యాల నాయుడు, ఏపీ రైతు సంఘం నాయకులు గండి నాయన బాబు, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర నాయకురాలు జి కుమారి తీవ్రంగా ఖండించారు.

కశింకోట : చలో విజయవాడ నేపథ్యంలో కశింకోటలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు సోమవారం ఉదయం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిరంకుశ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలను పరిష్కరించండి

సిఐటియు ఆధ్వర్యాన నిరసన, ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆర్‌డిఒ జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యహ్న భోజన పథకం అమలు చేస్తున్న తమకు రోజుకు రూ.30వేతనం కూడా గిట్టుబాటు కావడం లేదని ఇలాగైతే ఎలా బతకాలని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీసవేతనం రూ.21వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై పోరాడితే పోలీసులతో అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు ప్రభుత్వం పూనుకుంటోందన్నారు. అంగన్వాడీల చలో విజయవాడ ఆందోళన భగ్నానికి పోలీసుల అమానుష చర్యలను సిఐటియు నేతలు ఖండించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డి సత్తిబాబు, కార్యదర్శి అడిగర్ల రాజు, యూనియన్ నాయకులు ఓమ్మి నూకరాజు ,పి. జగది, లక్ష్మి, చిన్నతల్లి పాల్గొన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు